ధైర్యంగా పని చేసే అవకాశం కల్పించాలి



విధి నిర్వహణలో మహిళా వైద్యులకు భద్రత కల్పించాల్సి ఉంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాత్రిళ్లు మహిళా వైద్యులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కనీస సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలి. ఎంతో మంది మహిళలు దేవుడి మీద భారం వేసి పని చేస్తున్నారు. ప్రభుత్వం పూర్తి భద్రత కల్పిస్తే వైద్యులు ధైర్యంగా పని చేయగలరు. దీనివల్ల వారు మరింత నైపుణ్యవంతంగా సేవలందించగలరు. – డాక్టర్ ఉషా ప్రసాద్, గైనిక్ ప్రొఫెసర్, సూపరింటెండెంట్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, విశాఖ

డాక్టర్ల రక్షణకు చర్యలు తీసుకోవాలి



సమాజంలో కీలకమైనది డాక్టర్ వృత్తి. మా ప్రాణాలు పణంగా పెట్టి ఎందరి ప్రాణాలో కాపాడుతున్నాం. అటువంటి వృత్తిలో ఉన్న మాకు రక్షణ అవసరం ఉంది. కోల్‌కతాలో జరిగిన ఘటన దేశంలో మరెక్కడా జరగకుండా ప్రత్యేక చట్టం తీసుకు రావాలి. పార్లమెంట్‌లో అనేక బిల్లులు ప్రవేశపెడుతున్నారు. డాక్టర్ల రక్షణకూ బిల్లులు ప్రవేశపెట్టి అమలు చేయాలి.

– డాక్టర్ కందవల్లి సందేశ్, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు

చట్టాలు కఠినంగా అమలు చేయాలి



వైద్య సిబ్బంది కోసం ప్రభుత్వాలు రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిందే. పని ప్రదేశంలో విశ్రాంతి గదులు ఉండాలి. సీసీ కెమెరాలు తప్పనిసరి. సెక్యూరిటీ పెంచాలి. ప్రధానంగా మహిళా ఉద్యోగుల దగ్గర మహిళా భద్రతా సిబ్బందిని నియమించాలి. అప్పుడే మనిషికి మనిషి తోడుండి ధైర్యంగా పని చేయగలం. ఈ విషయంలో ప్రభుత్వాలు సత్వరం చర్యలు తీసుకోవాలి.

– వి. ఉషారాణి, హెడ్‌నర్స్, కేజీహెచ్

క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా స్థాయిలో 8, 9 తరగతి విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు శుక్రవారం రేసవానిపాలెంలో ఉన్న జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు బహుమతులు అందజేశారు. యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా 18 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రథమ బహుమతి కింద రూ.5 వేలు (నడుపూరు, జెడ్పీ హైస్కూల్), ద్వితీయ బహుమతి రూ. 4 వేలు (నరవ జెడ్పీ హైస్కూల్), తృతీయ బహుమతి రూ. 3 వేలు (ఇస్లాంపేట జెడ్పీ హైస్కూల్) అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు, జిల్లా సూపర్‌వైజర్ భద్రి, సైన్సు ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


డిజిటల్ యుగంలో జాగరూకత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే

విశాఖ సిటీ: డిజిటల్ యుగంలో ఉద్యోగులు జాగరూకత, అవగాహన, భద్రతను పాటించడం అవసరమని విశాఖ పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పోర్ట్ పరిపాలన భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో సైబర్ సెక్యూరిటీపై అధికారులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ చైర్మన్‌తో పాటు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎల్.ఎల్.స్వామి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సైబర్ మోసాలు, నేరాల నుంచి ఎలా తప్పించుకోవాలనే అంశాలను సైబర్ సెక్యూరిటీ నిపుణులు వివరించారు. రోజువారీ జీవితాలలో సైబర్ మోసాలు, నేరాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఇవి ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

యూజీడీ లీకుతో అవస్థలు



అమ్మవారివీధిలో పొంగిపొర్లుతున్న యూజీడీ

అల్లిపురం : యూజీడీ పొంగిపొర్లడంతో అమ్మవారివీధి స్థానికులుఇబ్బందులు పడుతున్నారు. గత పది రోజులుగా అమ్మవారివీధి, ఎస్సీకాలనీలో గల యూజీడీ బ్లాక్ అవటంతో వ్యర్థాలు మ్యాన్‌హోల్ నుంచి బయటికి వస్తుండటంతో స్థానికులు దుర్వాసనకు ముక్కు మూసుకుని నడిచే పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు వార్డు మాజీ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చిరపల్లి లక్ష్మీరాము శుక్రవారం జోన్–4 జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. తక్షణమే బ్లాక్ అయిన యూజీడీని శుభ్రపరచాలని కోరారు.

సమస్యల సుడిలో.. చేపల మార్కెట్



కనీస సదుపాయాలకు నోచుకోని శ్రీపోలమాంబ చేపల మార్కెట్

జీవీఎంసీ 37వ వార్డు పరిధి రెల్లివీధిలో గల శ్రీపోలమాంబ చేపల మార్కెట్ సమస్యల సుడిలో చిక్కుకుంది. మౌలిక సదుపాయాలు లేక ఇక్కడి చేపల విక్రయదారులు (చిరు వ్యాపారులు) సతమతమవుతున్నారు. ప్రజాప్రతినిధులు.. జీవీఎంసీ అధికారుల చుట్టూ తిరిగినా స్పందించే నాథుడే కరవయ్యారంటూ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- చిన్నపాటి వర్షానికే కారిపోతున్న రేకుల షెడ్డు
- శిథిలమైన గేట్లు
- విలువైన మత్స్యసంపదను తస్కరిస్తున్న దొంగలు
- ఇదీ రెల్లివీధి చేపల మార్కెట్ దుస్థితి



చేపల బజారు లోపలి దృశ్యం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 37వ వార్డు పరిధి రెల్లివీధి పోలమాంబ చేపల మార్కెట్‌కు రెల్లివీధి, కోడి పండ్యాల వీధి, జబ్బరతోట, పెయిందొరపేట తదితర ప్రాంతాల ప్రజలు చేపలు, రొయ్యలు, పీతల వంటి మత్స్య సంపద కొనుగోలుకు వస్తుంటారు. ఈ చేపల మార్కెట్లో మౌలిక సదుపాయాలు లేక ఇటు విక్రయదారులు.. అటు కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. చేపల మార్కెట్‌కు షెడ్డు ఉన్నప్పటికీ ఏ పాటి వర్షం కురిసినా చేపల బజారంతా వరదలా మారిపోతుంది. ఇదిలా ఉండగా అక్కడి గచ్చును టైల్స్‌తో అద్దడంతో చిన్నపాటి వర్షానికే మార్కెట్ అంతా బురదమయమవుతోంది.

ఏడాదిన్నర కిందట ఓ మహిళ చేపల కొనుగోలుకు వచ్చి బురదగా ఉన్న గచ్చుపై జారిపడింది. తలకు తీవ్ర గాయమైన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని అక్కడి జాలర్లు.. చేపల విక్రయదారులు సాక్షి దృష్టికి తీసుకొచ్చారు. కొనుగోలుదారులు చేపలు కొనుగోలు చేయాలంటే అవస్థలు పడాల్సి వస్తోంది. దుర్వాసన వెదజల్లుతుండడంతో లోపలికి వెళ్లలేక బయటే కొనుగోలు చేసి వెళ్లిపోతున్నారు.

మార్కెట్లో దొంగతనాలు..

ఇదిలా ఉండగా చేపల మార్కెట్లో దొంగతనాలు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్‌కు అటు ఇటు ఉన్న గేట్లు రెండూ మూలకు చేరడంతో రాత్రి వేళల్లో చిల్లర దొంగలు విలువైన చేపలు దొంగిలిస్తున్నారు. **ఇటీవల కాలంలో సుమారు రూ.15 నుంచి రూ.20 వేల విలువ చేసే చేపలను చిల్లర దొంగలు దొంగిలించినట్లు అక్కడి చేపల** విక్రయదారులు చెప్పి బోరుమన్నారు. తరచూ జరుగుతున్న దొంగతనాలపై ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించడం లేదని లబోదిబోమంటున్నారు. ఏ పాటి గాలి వీచినా, వర్షం వచ్చినా అక్కడి చెట్టు కొమ్మలు షెడ్డుపై పడుతుండడంతో రేకులు విరిగిపోతున్నాయని, పలుమార్లు సొంత డబ్బులు వెచ్చించి మరమ్మతులు చేపట్టినా ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపల మార్కెట్‌ను శుభ్రపరిచే వారు లేక తామే శుభ్రం చేసుకుంటున్నామని సాక్షికి తెలిపారు.



మా గోడు ఎవరు వింటారు?

మా గోడు వినేవారు లేరు. గత కొన్నేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నిలువ నీడ లేని పరిస్థితిలో ఉన్నాం. ఏ పాటి వర్షం వచ్చినా శ్లాబ్‌పై వర్షపు నీరు నిలిచిపోవడంతో నీరు కారడమే కాక పెచ్చులూడుతున్నాయి. మార్కెట్‌కు ఉన్న గేట్లు మూలకు చేరాయి. ఇటీవల కాలంలో చేపల దొంగతనం ఎక్కువైంది. ఈ విషయమై పలు మార్లు రాజకీయ నాయకులు, జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఎవరూ స్పందించలేదు.

– సత్యమమ్మ, చేపల వ్యాపారి

మార్కెట్ శిథిలావస్థకు చేరింది..

మార్కెట్ షెడ్డుపై చెట్టు కొమ్మలు విరిగిపడి పాడయ్యాయి. గేట్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్లో దొంగతనాలు జోరుగా సాగుతున్నాయి. ఏ పాటి వర్షం కురిసినా మార్కెట్ అంతా బురదమయమవుతోంది. చేపలు కొనుగోలు చేసే వారు ఆ బురదలో జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. మార్కెట్‌ను శుభ్రపరిచే వారు లేక మేమే శుభ్రం చేసుకుంటున్నాం. మా సమస్యలు అధికారులు పరిష్కరించాలి.

– కొర్లమ్మ, చేపల వ్యాపారి

మర్యాదపూర్వక కలయిక



జగన్‌మోహన్‌రెడ్డితో ద్రోణంరాజు శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్ : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విశాఖ విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ నివాసంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు.



జగన్‌మోహన్‌రెడ్డితో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ

జోరుగా అక్రమ కట్టడాలు



జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించిన అనధికార కట్టడం



వాహనాల మాటున నిర్మిస్తున్న అక్రమ కట్టడం

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ పరిధిలో ఆక్రమణలు జోరందుకుంటున్నాయి. ముందుగా బడ్డీలు పెట్టి తర్వాత ఎటువంటి అనుమతులు లేకుండా అనధికార కట్టడాలకు ఆక్రమణదారులు పాల్పడుతున్నారు. వార్డులో ఫ్రూట్ మార్కెట్ వద్ద ఓ అనధికార కట్టడం దాదాపు సగానికి పైగా నిర్మాణం జరిగిపోయింది. దీనిపై కొందరు వ్యక్తులు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఆక్రమణలు పూర్తిగా తొలగించారు. ఇదే మార్కెట్‌కు ఆనుకుని మరో కట్టడం కూడా జరుగుతోంది. వాహన డ్రైవర్ల యూనియన్ పేరుతో ముందుగా తాత్కాలిక షెడ్ నిర్మించి తర్వాత పక్కా బిల్డింగ్ నిర్మిస్తున్నారు. దాదాపు 50 గజాలకు పైగా జీవీఎంసీ స్థలాన్ని కబ్జా చేసి వాహనాల మాటున దర్జాగా నిర్మాణం చేసుకుంటున్నారు. దీనిపై కూడా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వీధి దీపాలు వెలగక ఇబ్బందులు



వీధి దీపాలు వెలగని విద్యుత్ స్తంభం

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు పరిధి వెంకటేశ్వరమెట్టపై ఎస్ఎస్11/బి ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోకి వచ్చే కొన్ని వీధి దీపాలు వారం రోజులుగా వెలగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే చాలు వెలుతురు లేక ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా జీవీఎంసీ విద్యుత్ విభాగం సిబ్బంది పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి తక్షణమే వీధి దీపాలకు మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టంగుటూరికి ఘన నివాళి



కేజీహెచ్‌లో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డాక్టర్ శివానంద్ తదితరులు

మహారాణిపేట : టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్య సాహసాలకు మెచ్చి ప్రజలు ఆంధ్రకేసరి బిరుదు ఇచ్చి గౌరవించారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. శుక్రవారం కేజీహెచ్‌లో టంగుటూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆర్ఎంవోలు డాక్టర్ జగదీష్, డాక్టర్ రాజేష్, ఏవో మంగరాజు, మేనేజర్ పీఎం జవహర్‌లాల్, అకౌంటెంట్ సత్యనారాయణ, సీనియర్ సహాయకులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో ఆంధ్రకేసరి జయంతి

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ తదితరులు పాల్గొని టంగుటూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, కార్యదర్శి నల్లనయ్య, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంవీడీ ఫణిరామ్ పాల్గొన్నారు.



జీవీఎంసీలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు



ఆంధ్రకేసరికి నివాళులు అర్పిస్తున్న బ్రాహ్మణ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

ఆంధ్రకేసరికి ఘన నివాళి..

సీతమ్మధార : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా బ్రహ్మణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైజాగ్ బ్రహ్మణ వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు టీఎస్ఆర్ ప్రసాద్, అధ్యక్షుడు కె.చరణ్‌కుమార్, నాయకులు కె. నరసింహమూర్తి, వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళకారిణి.. సౌభాగ్యప్రదాయిని

కనకమహాలక్ష్మి ఆలయంలో వేడుకగా శ్రావణ శుక్రవారం పూజలు



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. అమ్మ వారిని విశేషంగా అలంకరించి, వేద మంత్రాలు, నాదస్వర వాయిద్యాల మధ్య క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కనకమహాలక్ష్మి స్వర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు విశిష్ట శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్నారు. పోస్టు ద్వారా వివరాలు పంపి డబ్బు చెల్లించిన వారి పేరిట వేద పండితులు అర్చన చేసి, వారికి కుంకుమ, ప్రసాదం పంపారు. ఉదయం 8.10 గంటలకు మొదటి బ్యాచ్, 9.30 గంటలకు రెండవ బ్యాచ్ పూజలో పాల్గొన్న మహిళల్లో ఇద్దరు భక్తుల పేర్లను డ్రా ద్వారా తీసి.. వారికి శ్రీలక్ష్మీదేవి వెండి ప్రతిమలు బహూకరించారు. ఆలయ మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



రజత వస్త్రాలంకరణలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు

డాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని రజత వస్త్రాలంకరణలో అలంకరించారు. అమ్మవారి మూలవిరాట్‌కు వేకువ జాము 5 గంటలకు శుద్ధజలం, పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ వంటి 108 ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో క్షీరాభిషేకం చేసి సహస్ర రక్తవర్ణ పగడాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. దేవాలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. దేవస్థాన ఆస్థాన పురోహితుడు ఆర్‌బీబీ కుమారశర్మ 300 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీ కుమార్, శ్రావణ మాస ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ కొల్లూరు వెంకట సుజాత, కొల్లూరు విశాల, దేవాలయ మహిళా విభాగం అధ్యక్షురాలు బాదం నాగ వెంకట కమల, సహాయ కార్యదర్శి కట్టమూరి ప్రసన్న, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాహనాల వలయంలో రాణి విగ్రహం



రాణి విగ్రహం చుట్టూ పార్కింగ్ చేసిన వాహనాలు

జగదాంబ : జీవీఎంసీ 39వ వార్డులోని రాణి విగ్రహం చుట్టూ వాహనాలతో సెక్యూరిటీ ఏర్పాటు చేశారని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ దగ్గర ఉన్న రాణి విగ్రహం వద్ద స్థానికులు ప్రతిరోజు అనధికారికంగా పార్కింగ్ చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యాటక కేంద్రంగా, స్థానికులు సాయంత్రం వేళల్లో సేద దీరడానికి వీలుగా విగ్రహం ఏర్పాటు చేస్తే వాహన చోదకులు వాహనాలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మరి కొన్ని వాహనాలు సంవత్సరాల తరబడి అక్కడే వదిలేస్తున్నారని చెబుతున్నారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్నా పోలీసులు కనీసం పట్టించుకోకపోవడంతో ఆక్రమణలు ఎక్కువ అవుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి విగ్రహం చుట్టూ వాహనాలు తొలగిస్తే స్థానికులు సాయంత్రం వేళల్లో సేదదీరుతారని స్థానికులు చెబుతున్నారు.

పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



మాట్లాడుతున్న సీతారాం

విశాఖ విద్య : జాతీయ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, సూచనలను అనుసరించి పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. శుక్రవారం ఆరిలోవ సెయింట్ ఆన్స్ పాఠశాలలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖల సమన్వయంతో 'బాలల హక్కుల పరిరక్షణలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, వార్డు సచివాలయం కార్యదర్శులు పాత్ర'పై అవగాహన సదస్సు నిర్వహించారు. చినగదిలి మండల విద్యాశాఖాధికారి ఎం.రవీంద్ర అధ్యక్షత వహించగా జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ ఖలీషా బేగం సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ జిల్లా విద్యా శాఖ సమన్వయంతో పనిచేసి విద్యార్థినుల భద్రతకు కృషి చేయాలన్నారు. బాలలపై లైంగిక దాడులు, మంచి, చెడు స్పర్శలు, ఆడపిల్లల రుతుస్రావ సమయంలో ఆరోగ్య జాగ్రత్తలు, బాలల హక్కులు, మాదక ద్రవ్యాల నియంత్రణ వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. వీటిపై విద్యార్థులు స్వేచ్ఛగా తమ ఇబ్బందులను తెలియజేసేందుకు ప్రతీ పాఠశాల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. సీనియర్ సైకాలజిస్టులు పార్వతి కాశ్యప్, గాయత్రి మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు.. పిల్లలకు మేలుకలిగే ఎన్నో విషయాలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ద్వారా చేరవేసేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర ట్రెజరర్ ఎం.వి.రావు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు లక్ష్మి, సర్వశిక్షా అభియాన్ పీడీ బి.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి–2 అనురాధ, అర్బన్ చైల్డ్ డెవలప్‌మెంట్ పీడీ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది బి.శకుంతల,ఆనంద్, శారద, కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయ, సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సుమతి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం



ఏఈవో రాంబాబుకు చెక్కు అందజేస్తున్న గరిమెళ్ల సూర్య వెంకట లక్ష్మీనారాయణ

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన గరిమెళ్ల సూర్య వెంకట లక్ష్మీనారాయణ భారీ విరాళం అందజేశారు. ఆయన భార్య గరిమెళ్ల వెంకట సీతామహాలక్ష్మి పేరిట రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం చెక్కు రూపంలో ఆలయ ఏఈవో వెంపలి రాంబాబుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.